తాత ముత్తాతల ఆస్తి విషయంలో శంకరయ్య, సాంబయ్య కోర్టు కెక్కారు. కోట్లు కలిసి వచ్చే సంపద అది. ఎక్కడ లేని సాక్షుల్నీ పిలిపించి పలికించారు. మూల మూలల ఉన్న కాగితాల్ని వెలికితీసి, ఆధారాలుగా అందించారు. ఇద్దరూ మంచి లాయర్లని పెట్టి వాద ప్రతివాదాలు జరిపించారు. లాయర్లు ఊళ్ళో ఉద్దండ పిండాలు. ఎవరిపరంగా తీర్పు జరుగుతుందో ఎవరూ చెప్పలేని క్లిష్ట పరిస్థితి. చివరకి అంత గట్టిగా వాదించిన లాయర్లు కూడా చెప్పలేక పోతున్నారు. 'ఫిఫ్టీ ఫిఫ్టీ' అన్నమాటే కాని కచ్చితంగా మనదే గెలుపని తన క్లయింటుకి చెప్పలేక పోతున్నారు.

జడ్జీగారు తీర్పు చెప్పే రోజు దగ్గర పడింది. ఇక సస్పెన్సు నాపుకోలేకపోయాడు శంకరయ్య. తన లాయరు నాగరాజ్ దగ్గరకి వెళ్ళి ''జడ్జిగారితో చెప్పి మన వైపు తీర్పు జరిపించటానికి సాధ్యం కాదాండీ?'' అని ఆశగా అడిగాడు.

అంతటి పేరుమోసిన లాయరుకే అతని ఆంతర్యమేమిటో అర్థం కాలేదు. ''చెప్పటం అంటే నీ ఉద్దేశ మేమిటయ్యా?'' అని చిరాకు పడ్డాడు.

# లౌకికం

-తటవర్తి రామచంద్రరావు




శంకరయ్య బలవంతంగా నవ్వి ''కోప్పడకండయ్యా! నే చెప్పేది కాస్త ఓపిగ్గా వినండి. నేను పూతరేకులంటే పడిచస్తాను. తమరికి పనస తొనలంటే మహాప్రీతి. మనిషన్నాక ఏదోటి ఇష్టముండకుండా ఉంటుందంటారా?...'' అని అర్థోక్తిలో ఆగిపోయాడు.

నొసలు చిట్లించాడు నాగరాజ్. ''అంటే. జడ్జిగారిక్కూడా ఏదో ఇష్టముంటుందంటావు?''

''నా మనసులోని మాటని ఇట్టే పట్టేసారు లాయరు గారూ!''

''నీ పొగడ్తలకేం కాని ఇక్కడితో ఆ సంగతి మర్చిపో! జడ్జీ పాపారావుగారు నిప్పులాంటి మనిషి. మహా కోపిష్టి. లంచం మాటెత్తకు. ఏదయినా పొరపాటు చేసావో నీ పని ఆఖరు! జాగ్రత్త!'' అని హెచ్చరించాడు నాగరాజ్.

వారం తర్వాత జడ్జీగారు తీర్పునివ్వటం జరిగిపోయింది. శంకరయ్య గెలిచాడు. కోర్టు బయట అతన్ని కలిసాడు నాగరాజ్. అతనాశించినంత ఆనందం శంకరయ్య ముఖంలో కనిపించలేదు. తన మూలంగానే కేసు గెలిచానని తెగ పొగుడుతాడనుకున్నాడు. అదీ జరగలేదు. కులాసాగా నవ్వుకుంటున్న శంకరయ్యని చూసేసరికి అతని కాశ్చర్యమేసింది. తనే మాట కలిపి ''మొత్తం మీద నా వాదన మూలంగా కేసు గెలిచావు'' అన్నాడు.

''దానికన్న చివర్న మీరిచ్చిన హెచ్చరిక అద్భుతంగా పని చేసింది సార్!'' అన్నాడు శంకరయ్య పలచగా నవ్వుతూ.

''అంటే?''

''జడ్జీగారు లంచం పేరెత్తితే మండిపడతారన్నారు కదా!''

''అవును''

''మీరు మరోలా అనుకోకపోతే ఓ విధంగా ఆ లంచం మూలంగానే నేనిప్పుడు కేసు గెలిచాను''.

నాగరాజ్ అదిరిపోయాడు. ''ఏమిటి నువ్వనేది?''

''మీరు వద్దువద్దన్నా నాకు మనసు పీకుతూనే ఉంది. జడ్జీగారు కూడా మనిషే కదా! ఏదోటి వీక్నెస్ ఆయనకి ఉండకపోతుందా అని వాళ్ళ వంట మనిషి ద్వారా ఆయనకి రత్నగిరి 'ఆల్ఫన్సో' మామిడి పళ్ళంటే మహా యిష్టమని తెలుసుకున్నా. రెండు పెట్టెల పళ్ళు మూడ్రోజుల నాడు వాళ్ళింటికి పంపించా! అంతే!'' అని ముసిముసిగా నవ్వాడు శంకరయ్య.

''అసంభవం! జడ్జిగారికి ఆల్ఫన్సోలు ఇష్టం కావచ్చు. కాని ఆయన లంచం పుచ్చుకుని నీ తరపున తీర్పు చెప్పారంటే నేను నమ్మను''.

''అబ్బే, అలాగని నేనన్నానా? లంచం ఇచ్చిన వాళ్ళ మీద ఆయన విరుచుకు పడతారని మీరే చెప్పారు కదా! ఆ రెండు పెట్టెలతో పాటు సాంబయ్య బిజినెస్ కార్డు సంపాదించి దాన్ని చేర్చి పంపానులెండి. అంతే!''

*

రచయిత సెల్ నెం: 99105 73770